క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మాచర్ల: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ వెంకట్ దాస్, తహసీల్దార్ బి.మంజునాథరెడ్డిలు గురువారం పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాల కల్పన, రాబోయే రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. వీరితో పాటు పోలింగ్ కేంద్రాల నిర్వాహకులు రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా 'కోడూరి'



పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కోడూరి సత్యనారాయణ వరప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు గురువారం వర ప్రసాద్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, మాజీ సమాచార కమిషనర్ రేపాల శ్రీనివాసరావులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రసాద్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమకం కావడంతో పట్టణంలోని పలువురు ప్రముఖులు ఆయనను సన్మానించి అభినందించారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమద్దీక్షా పరులు తెల్లవారుజామున 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం హరేరామ నామ సంకీర్తన జరిగింది. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. 16న తిరునాళ్ల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి




పెదకూరపాడు: అత్యంత సమస్యాత్మక గ్రామమైన గారపాడులో గురువారం క్రోసూరు సీఐ మంగరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా మంగరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత పోలింగ్‌కు ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు శాంతియుతంగా ఓటును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. వారి వెంట ఎస్ఐలు విపర్ల వెంకట్రావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కోదండ రాముని గ్రామోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని రైలు గేటు సమీపంలో కోదండ రామాలయానికి ధ్వజస్తంభ ప్రతిష్టాపనా మహోత్సవం సందర్భంగా గురువారం అంకురార్పణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గో పూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, రక్షాబంధన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం నిర్వహించారు. ప్రతిష్టింప చేసే జీవధ్వజ స్తంభం, సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామ స్వామి వార్ల ఉత్సవమూర్తుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాయి దత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీ రామా నంద ప్రభూజీ(హైదరాబాద్), ధ్వజస్తంభ దాతలు వరికల్లు కోటేశ్వరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

27 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని 2వ సచివాలయంలో 90 రోజుల కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డుల్లోని 27 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు కాగా గురువారం పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, 2వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు మాదిగొండ నారాయణలు పేదల స్థల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాడు

ఆ గ్రామంలో ఒకే సామాజిక వర్గం. అంతా ముస్లింలు. గ్రామ జనాభా సుమారు 7,800. అన్నింటా చాలా వెనుకబడిన గ్రామం. ఎక్కువ మంది కష్టాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి అంతంత మాత్రమే. సరైన గ్రామ పంచాయతీ కార్యాలయం ఉండేది కాదు. సంక్షేమం అంతంత మాత్రమే. సరైన వైద్య సేవలు అందేవి కావు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్ని రంగాల్లో వెనకబడిన తురకపాలెం గ్రామ రూపురేఖలు మారుస్తానని మాట ఇచ్చారు.

నేడు

మాచవరం మండలంలోని తురకపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గ్రామానికి నిధులు వెచ్చిస్తూ అభివృద్ధికి తోడ్పాటు అందించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఆయా కుంటుంబాల అభివృద్ధికి బాసటగా నిలిచాయి. గ్రామంలో జరిగిన అభివృద్ధి చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి కేరాఫ్ తురకపాలెం

- రూ.15.36 కోట్లతో నవరత్నాల ద్వారా ప్రతి ఇంటా సంక్షేమం
- రూ.4.41కోట్లతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు
- అభివృద్ధిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం



గ్రామంలో వేసిన సీసీ రోడ్లు

మాచవరం: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని, పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధిని ప్రతి మారుమూల పల్లెకు చేర్చింది. దాంతో పల్లెలు కొత్త రూపు సంతరించుకున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంలో కొన్ని ఇలా..

- రూ.40 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు
- రూ.45 లక్షలతో నాడు-నేడు ద్వారా యూపీ స్కూల్, ఉర్దూ స్కూల్‌లో అదనపు తరగతి గదులు నిర్మాణం, మౌలిక వసతులు
- రూ.10 లక్షలతో వాటర్ ప్లాంట్
- రూ.40 లక్షలతో నూతన సచివాలయం
- రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.21 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్
- రూ.25 లక్షలతో షాదీఖానా భవన నిర్మాణ పనులు
- గ్రామంలో రూ.1.30 కోట్లతో సీసీ రోడ్లు
- రూ.5 లక్షలతో ముస్లిం బాలికలకు మదర్సా నిర్మాణం
- నవరత్నాల పథకాలు... చేయూత ద్వారా రూ.87,18,750
- వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.1,22,81,179
- రైతు భరోసా ద్వారా రూ.2,68,15,350

ఇవికాక మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.



రైతు భరోసా కేంద్రం



హెల్త్ సెంటర్

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితోనే సాధ్యపడింది..



గ్రామాభివృద్ధి గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితోనే సాధ్యపడింది. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు పరుగులు పెట్టించారు. అదే ఉత్సాహంతో మేము పనులు చేశాం. భవిష్యత్‌లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన గురించి చెప్పుకునేలా శాశ్వత పనులు చేపట్టాం.

షేక్ అల్లాభక్షు సర్పంచ్, రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయి..



నాకు 70 ఏళ్లు, ఎన్నో ప్రభుత్వాలు చూసాను. ప్రజల కష్టాలను తెలుసుకొని ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ పథకాలు అందించడం చాలా ఆనందంగా ఉంది. కేవలం 5 ఏళ్లలో మా గ్రామంలో ఇంత అభివృద్ధి ఎప్పుడూ చూడలేదు.

షేక్ లక్మన్ సాహెబ్

నీటి కష్టాలు తీరాయి..



గ్రామంలో నీటి సమస్య ఎక్కువగా ఉండేది. వీధిలో నుంచి నీళ్లు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు కుళాయి ద్వారా ఇంటికే నీళ్లు వస్తున్నాయి. ప్రభుత్వం ఎంతో మంచి పని చేసింది.

షేక్ మహబ్బి

వైఎస్సార్ చేయూత ఆదుకుంది..



వైఎస్సార్ చేయూత నన్ను ఆదుకుంది. దాని ద్వారా వచ్చిన డబ్బులతో చిన్న వ్యాపారం చేస్తూ కుంటుంబాన్ని పోషించుకుంటున్నాను. సీఎం జగనన్న మేలు ఎన్నడూ మర్చిపోను. మరలా జగన్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నా.

షేక్ కరిమూన్

కార్పొరేట్ స్థాయిలో అంగన్‌వాడీల నిర్వహణ



తాళ్ళపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నారని గ్రామ సర్పంచ్ యంద్ర గాలయ్య, సూపర్‌వైజర్ టి.సరళ అన్నారు. గురువారం రెండవ రోజు మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల ప్రాధాన్యత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతూ చిన్నారుల విద్యాభ్యాసం కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలకు విలువైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, ఎం.జ్యోతి, అంగన్‌వాడీ ఉద్యోగులు శివపార్వతి, స్వప్న, వెంకమ్మ, సౌభాగ్యం, వసుమతి తదితరులున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గురజాల : బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన కల్పించారు. నగర పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పోషక విలువలున్న శ్రేష్టమైన ఆహారం తీసుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఉన్నారు.

మహాత్ముని ఆశయాలు నెరవేరుస్తున్న జగనన్న ప్రభుత్వం

ప్రభుత్వ విప్ పీఆర్కే



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ తదితర భవనాలు నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేస్తూ ఆయన ఆశయాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం మనదేనని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కంభంపాడు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి, బోర్లను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రజల వద్దకే ప్రభుత్వ కార్యాలయాలను, అధికారులను తీసుకురావటమే కాకుండా గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఇంటింటికీ వచ్చి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించిన ప్రభుత్వం జగనన్నదేనన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు నివసించే ప్రాంతాలలో సీసీ రోడ్లు, కాల్వలు నిర్మించటమే కాకుండా వేసవి దాహార్తిని తీర్చేందుకు బోర్లు వేస్తున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలిచి మోసపూరిత చంద్రబాబుకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరికట్ల చంద్రారెడ్డి, సర్పంచ్ యశోదమ్మ, ఎంపీటీసీలు కాసుబోయిన వెంకటరమణ, దేవరాయి అచ్చమ్మ, ఉపసర్పంచ్ పాశం బుగ్గమల్లారెడ్డి, నాయకులు కె.రామస్వామి, బ్రహ్మసాని నాసరయ్య, కె.ఫ్రాన్సిస్, రామకృష్ణారెడ్డి, సీహెచ్ నాగేశ్వరరావు, నక్కా కోటేశ్వరరావు, కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు ఉన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టా

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఇంటి పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి

పిడుగురాళ్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలిచ్చి ఇచ్చిన హామీని నెరవేర్చామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సూర్య సెమ్ ఫ్యాక్టరీ కార్మికులకు గురువారం ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాసు ప్రతి ఒక్కరికి తన చేతులమీదుగా ఇంటి పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రెక్కాడితేగాని డొక్కాడదని అటువంటి వారు సొంత ఇల్లు నిర్మించుకోవాలంటే సాధ్యపడదు. అందుకే గతంలో ఇంటి స్థలం కావాలని తనను కోరడంతో ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీని నేడు నెరవేర్చాం, అంతే కాదు మరో రూ.2 లక్షలు ఇంటి నిర్మాణానికి అందిస్తామన్నారు. ఇప్పుడు సుమారు 150 మందికి ఇంటి పట్టాలిచ్చాం. ఇంకా అర్హులు ఉంటే అందరికి ఇంటి పట్టాలు అందిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు అందిస్తున్నామన్నారు. పట్టణంలో ఇప్పటికి 7 వేలకు పైగా ఇంటి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెం బంగారెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, కత్తెరపు రాంగోపాల్‌రెడ్డి, బత్తుల నాగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నాయకుల విగ్రహాలకు కేరాఫ్ పిడుగురాళ్ల

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: జాతీయ నాయకుల విగ్రహాలకు కేరాఫ్‌గా పిడుగురాళ్ల పట్టణం ఉండబోతుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు ఎదురు ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు గురువారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే పలువురు జాతీయ నాయకులు విగ్రహాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పుడు ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు కాబోతుంది, అలాగే త్వరలో పొట్టి శ్రీరాములు, మదర్ థెరెసా విగ్రహాలు ఏర్పాటు చేయాలని మన నాయకులు కోరడం జరిగింది. త్వరలో బైపాస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. అక్కడ కుడా విగ్రహాలు ఏర్పాటు చేయాలి అన్నారు. మొత్తం మీద పిడుగురాళ్ల పట్టణం విగ్రహాల ఏర్పాటుకు హబ్‌గా మారనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఛత్రపతి శివాజీ అభిమానులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్తెనపల్లి: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల చెప్పారు. పట్టణంలోని 30, 1, 2, 29 వార్డులలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రమీల చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. కొర్రలతో కొన్ని వంటకాలు తయారు చేయించారు. వీటి వలన 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శారీరక, మానసిక అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదెమ్మ, వెంకటలక్ష్మి, మిస్సీ కింగ్, జ్యోత్స్న రాణి, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

చదువుకు ఆరంభమే తప్ప అంతం లేదు

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాలి సైద్



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ఏజీపీ బాలి సైద్.

సత్తెనపల్లి: మనం చదివే చదువు వంద మార్కుల కోసం కాకుండా వంద సంవత్సరాల భవిష్యత్తు కోసం అని భావించి చదువుకోవాలని, చదువుకు ఆరంభమే తప్ప అంతం లేదని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షేక్ బాలి సైద్ అన్నారు. పట్టణంలోని రఘురామ నగర్‌లోని బీసీ బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ (సత్తనపల్లి) ఆధ్వర్యంలో రాజమండ్రికి చెందిన జి.రాజేష్, శ్రీలత దంపతుల సహకారంతో పదవ తరగతి బాలికలకు గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీవిద్య హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగ శ్రీవిద్య, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకు అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాది బాబురావు, హిందీ ఉపాధ్యాయులు సుభాని, హాస్టల్ వార్డెన్ ఇందిరా గాంధీ, ట్యూటర్ విజయ, విద్యార్థినులు ఉన్నారు.

సైన్స్ ప్రయోగాల ప్రదర్శన

నకరికల్లు: సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థుల పురోగతికి తోడ్పడుతుందని హెచ్‌ఎం రాయపాటి శివనాగేశ్వరరావు అన్నారు. కుంకలగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల పట్ల గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగమహేశ్వరపురంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న తాను హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ సైన్స్ అనే పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహిస్తూ సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంచడం కోసం ప్రయోగాలు చేయిస్తున్నట్లు తెలిపారు. పలురకాల సైన్స్ ప్రయోగాలు చేస్తూ, విద్యార్థుల చేత చేయిస్తూ శాస్త్రవిజ్ఞానంపై ఆసక్తిని కలిగించే విధంగా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాకెట్ పని చేసే విధానం, విమానం ఎగరడంలో ఇమిడి ఉన్న సూత్రం ఇలా 100కు పైగా ప్రయోగాలు చేసి చూపారు. నిత్యం మనం వాడే వస్తువులు, వినే శబ్దాలలో దాగి ఉన్న సైన్స్‌ను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ మేరీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల రైతులకు డ్రమ్ములు, టార్పలిన్‌లు అందజేత



యూనిట్ ఇన్‌చార్జి కె.జ్యోతి, ఐసీ ఆర్పీలు అంకమ్మ, శ్రీనివాసరెడ్డి, పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజుపాలెం: మండలంలోని గణపవరం యూనిట్ పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న డ్రమ్ములు, టార్పలిన్ పట్టాలు, 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు జిల్లా డీపీఎం కె.అమలకుమారి గురువారం అందించారు. ఈ సందర్భంగా అమలకుమారి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, ఎస్ఎఫ్ఏ సంధ్య, ఎంటీ విజయలక్ష్మి,

పారుపల్లిలో కొత్తగా ఐదు జ్వరం కేసులు



పారుపల్లి(క్రోసూరు): పారుపల్లిలో వైద్య శిబిరం గురువారం కొనసాగింది. జ్వరం కేసులు కొత్తగా ఐదు నమోదు అయినట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాలఅంకమ్మబాయి తెలియజేశారు. శిబిరంలో 21 మంది సాధారణ జలుబు, దగ్గు, ఒళ్లు, కాళ్ల నొప్పులు, షుగర్, బీపీ రోగులు రాగా వారికి వైద్య పరీక్షలు చేసి వైద్యం అందించటం జరిగిందన్నారు. ముగ్గురు జ్వర పీడితులను సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వైద్యురాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు జ్యోతిర్మయి, రజని, సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ కూచిపూడి ప్రభావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ టవర్‌ను తొలగించండి



సత్తెనపల్లి: మానవాళికి ముప్పుగా ఉన్న సెల్ ఫోన్ టవర్‌ను తొలగింప చేయాలని పట్టణంలోని 28 వార్డ్‌లో గల సాధువమ్మ హాస్టల్ వీధిలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో, తహసీల్దార్ సీహెచ్ ఉషకు, మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రాలను అందించారు. సత్తెనపల్లి పట్టణంలోని 28 వార్డ్‌లో గల సాధువమ్మ హాస్టల్ వీధిలో కొత్త సతీష్ అను వ్యక్తి గత ఆరు నెలల క్రితం స్థలం కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాకుండా ఎయిర్టెల్ 5జీ నెట్‌వర్క్ సెల్ ఫోన్ టవర్ నిర్మాణం మొదలు పెట్టాడన్నారు. ఈ విషయంపై స్థానికులు, మహిళలు నిరసన తెలిపినా గృహ యజమాని సతీష్ వారి అభ్యర్థనను బేఖాతరు చేస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకుండా సెల్ టవర్ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడన్నారు. తక్షణమే సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.